## ఈనెల 9న గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం

-సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు విజ్ఞప్తి.



**గొలుగొండ మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** గొలుగొండ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలు మరియు వివిధ ఎజెండా అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు మరియు వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విశాఖ సహకార శాఖలో కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

-ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం -- ఫిర్యాదు చేస్తామన్న ప్రజా సంకల్ప వేదిక

-రాష్ట్ర హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉల్లి తలుపులు




**గొలుగొండ మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** విశాఖపట్నం జిల్లా సహకార శాఖ కార్యాలయంలో రాష్ట్ర కమిషనర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉల్లి తలుపులు గొలుగొండలో తెలిపారు. రాష్ట్ర కమిషనర్ ఫైల్ నం. ఏజీసీ 06/29021/3/25 ద్వారా 27-11-2025న క్రమశిక్షణ చర్యలు తీసుకొని వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించినప్పటికీ నాలుగు నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదన్నారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం సెక్షన్ 6(1) కింద 05-02-2025న దరఖాస్తు చేసినప్పటికీ నెల రోజులు గడిచినా సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. కార్యాలయంలో ఆర్టీఐ యాక్ట్ సెక్షన్ 4(1)(బి) కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయాలపై రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ మంగళగిరి మరియు సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## స్మశాన స్థలం మంజూరు చేయండి.!!అని వినతిపత్రం..!!



**నందికొట్కూరు మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం తర్తూరు గ్రామంలో ఎస్సీ ఎస్టీ,బీసీ, కులాలకు సంబంధించిన వారికి స్మశాన స్థలాలు కేటాయించాలని డిప్యూటీ తహసీల్దార్ పి.సత్య దీప్,వీఆర్వో కి కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు కె.రంగమ్మ వినతి పత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మరణించిన వ్యక్తులకు పూడ్చుకోవడానికి స్మశాన స్థలం లేకపోవడం చాలా బాధాకరమని,చాలా ఇబ్బందికరంగా ఉందని ఉన్నత అధికారులు స్పందించి స్మశాన స్థలాలు మంజూరు చేయాలని కోరడం జరిగింది.విన్నపం విన్న డిప్యూటీ తహసీల్దార్ వెరిఫికేషన్ చేసి కేటాయించడం జరుగుతుంది.అని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు డిప్యూటీ తహసీల్దార్ పి.సత్య దీప్,వీఆర్వో కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కె.వి. పిఎస్ జిల్లా అధ్యక్షురాలు కె.రంగమ్మ,కెవిపిఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10న బాపన దొడ్డిలో శ్రీ పెద్దమ్మ శ్రీ సుంకులమ్మ అమ్మవార్ల దేవర

**క్రిష్ణగిరి మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** ఈనెల 10వ తేదీన మండల పరిధిలోని బాపన దొడ్డి గ్రామంలో శ్రీ పెద్దమ్మ శ్రీ సుంకులమ్మ అమ్మవార్ల దేవర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి సభ్యులు కేఇ జయన్న,మాజీ మంత్రివర్యులు కేఈ ప్రభాకర్, పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాం కుమార్ ల ఆధ్వర్యంలో ఈనెల9, 10 తేదీలలో గ్రామ దేవతామూర్తులకు పూజలు నిర్వహించి దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ అమ్మవార్ల దేవర ఉత్సవాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల అనుగ్రహము పొందగలరని గ్రామ పెద్దలు కోరారు.

## వైసీపీ జిల్లా యూత్ జనరల్ సెక్రటరీగా పెనుమత్స శివరాజు నియామకం



**గొలుగొండ మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** నర్సీపట్నం మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర గణేష్ ప్రతిపాదనతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసీపీ అనకాపల్లి జిల్లా యూత్ విభాగం జనరల్ సెక్రటరీగా గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన పెనుమత్స శివరాజును నియమించారు. పార్టీ పట్ల ఆయన చూపుతున్న కృషి, యువతలో మంచి అనుసంధానం, పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్రను దృష్టిలో ఉంచుకొని ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పెనుమత్స శివరాజు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన నియామకంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్.





( రేపల్లె నియోజకవర్గ ఇన్చార్జి: సిహెచ్ రాంబాబు. **చెరుకుపల్లి, మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కావూరు ,చెరుకుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను ఆయన ఆదేశించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థిని ,విద్యార్థుల తీరును పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు కళాశాలకు 67 మందిని కేటాయించగా 64 మంది విద్యార్థులు హాజరయ్యారని, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మీ తిరుపతమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ కళాశాలకు 44 మందిని కేటాయించగా అందరూ హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపర్డెంట్ బి భారతి కలెక్టర్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలను ఆయన పరిశీలించి పరీక్ష కేంద్రం నిర్వహణ ,పర్యవేక్షణ, పోలీసు బందోబస్తును ఆయన సిబ్బందిని, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ పద్మావతి, ఆయా పరీక్ష కేంద్రాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలు రాధిక కు శ్రీ శక్తి విశిష్ట పురస్కార అవార్డు



**మాచవరం మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** బ్రాహ్మణపల్లి స్పెషల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరకుటి రాధిక కు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ శక్తి విశిష్ట పురస్కార్ అవార్డు దక్కింది. విజయవాడలో విశ్వసహితీ కళా వేదిక ఆధ్వర్యంలో రాధిక కు విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి శాలువాతో ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రంతో పాటు విశిష్ట పురస్కార అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాధిక మాట్లాడుతూ తాను చేసిన పర్యావరణ సేవ వివిధ స్వచ్ఛంద కార్యక్రమాలను గుర్తించి విశ్వసాహితీ కళావేదిక ఈ అవార్డు అందించారని ఆమె అన్నారు .ఇందుకు చాలా ఆనందంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో గుమ్మడి గోపాలకృష్ణ ఐఏఎస్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, శ్రీధర్, రాజకుమారి తదితరులు రాధికను అభినందించారు

## శనగలు కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన..!!మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం.ప్రసాద్ రెడ్డి..!!



**నందికొట్కూరు మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** నందికొట్కూరు మార్కెట్ యార్డ్ లో శు క్రవారం శనగల కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం.ప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం శనగ రైతుల కోసం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు.దళారుల బెడద లేకుండా రైతులు నేరుగా శనగలను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.అదేవిధంగా శనగలు అమ్మే రైతులకు 15 రోజుల్లో సొమ్ము జమచేస్తారన్నారు.శనగలను అమ్ముకోవాలనుకునే రైతులు ముందుగా రైతుసేవా కేంద్రంలో సీఎం యాప్ ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు.క్వింటా మద్దతు ధర రూ.5,875 లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ప్రతి రైతుకు ఒక్క ఎకరనికి 10 క్వింటాల్ వరకు రైతుల వద్ద నుండి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది,ప్రైవేట్ దళారులు శనగలు క్వింటాలకు 5050 రూపాయలు మాత్రమే కొనుగోలు చేస్తుంది.ఇది గమనించిన ప్రభుత్వం రైతులకు మద్దతు ధరగా 5875 రూపాయలకు కొనుగోలు చేసి ఈ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుంది ఆయన అన్నారు.

## వీ.ఆర్.ఏ రమణ మృతి దహన సంస్కారాలకు రూ 25 వేల ఆర్థిక సహాయం చేసిన..!! తహసిల్దార్ శ్రీనివాసులు..!!



**నందికొట్కూరు మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** మిడుతూరు మండల పరిధిలోని బైరాపురం గ్రామానికి చెందిన వీ.ఆర్.ఏ రమణ అనారోగ్యంతో తెల్లవారుజామున మృతి చెందడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న తహసిల్దార్ శ్రీనివాసులు తలారి పూలమాలవేసి నివాళు లర్పించారు.అనంతరం అంతక్రియలకు కోసం 25 వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని భార్యకు అందజేయడం జరిగింది.

## ఘనంగా హజరత్ సయ్యద్ సుల్తాన్ షా ఖాద్రి షల్ఫీ స్వాముల వారి ఉరుసు మహోత్సవం..!!



**నందికొట్కూరు మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** మిడుతూరు మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో శ్రీశ్రీశ్రీ హాజరత్ సయ్యద్ సుల్తాన్ షా ఖాద్రి షల్ఫీ స్వాములవారి ఉరుసు పీఠాధిపతి హజరత్ సయ్యద్ సుభాహన్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా ఉరుసు మహోత్సవం జరిగింది.నాల్గవ తేదీ గంధం ఐదవ తేదీ ఉరుసు ఆరో వ తేదీ కిస్తీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కలను చెల్లించుకున్నారు.కోరుకున్న కోరికలను తీర్చే భగవంతుడు అని వారు అన్నారు.

## పులికొండ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోని మల్లవరం సరిహద్దు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మల్లవరం సమీపంలోని ట్యాంక్ బీడు -- పులికొండ అటవీ ప్రాంతంలో పెద్దపులి కనిపించినట్టు సమాచారం వచ్చిన నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మల్లవరం, గోవిందపురం, శివరామపట్నం, సింగరమ్మ చింత, కామరాజుపేట, మల్లిశాల, భావారం వంటి గ్రామాలతో పాటు గోకవరం, గంగవరం, జగ్గంపేట మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు రాత్రి వేళల్లో అనవసరంగా బయట తిరగకుండా ఉండాలని, తమ పశువులను సురక్షితంగా కాపాడుకోవాలని ఆయన సూచించారు. గ్రామ పరిసరాల్లో ఏదైనా అనుమానాస్పద చలనం గమనించిన వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ ఘటనపై తూర్పుగోదావరి మరియు కాకినాడ జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసి పెద్దపులిని పట్టుకునేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించినట్లు పేర్కొన్నారు. అటవీ అధికారుల చర్యలు పూర్తయ్యే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విజ్ఞప్తి చేశారు.

## బాలల హక్కుల పరిరక్షణ అవగాహన మరియు బాల్య వివాహ భక్తుభారత్ కార్యక్రమం








**నంద్యాల జిల్లా బ్యూరో ఇంచార్జి మధు మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** బాలల హక్కుల పరిరక్షణ అవగాహ మరియు బాల్య వివాహ భక్తుభారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామ సచివాలయం నందు సర్పంచ్ ఐ. లక్ష్మి దేవి మరియు పంచాయతీ సెక్రటరీ మహేశ్వరయ్య , ఐ సి డి ఎస్ సూపర్వైజర్ పద్మ అధ్యక్షతన జిల్లా బాలల సంరక్షణ విభాగం నుంచి అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం చట్టరీత్యా నేరమని బాలికల హక్కులకు భంగం కలిగించడమే కాకుండా తీవ్ర అనారోగ్య సమస్యలకు కూడా కారణమవుతుందని వివరించడం జరిగింది .మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగం అవుట్ రీచ్ వర్కర్ సునంద కుమారి మాట్లాడుతూ పిల్లలకు సంబంధించి ఎటువంటి సమస్యలకైనా 1098 నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలపడం జరిగింది ఈ కార్యక్రమానికి సచివాలయం సిబ్బంది మరియు , మరియు అంగన్వాడి సిబ్బంది నాగమల్లేశ్వరమ్మ , సావిత్రమ్మ,ఏ ఎన్ ఎం ఎస్ ఆశ వర్కర్లు, తల్లి దండ్రులు పాల్గొనడం జరిగింది.

## పుట్టకోటలో 17 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేత

తహసీల్దార్ మురళీ బాబు.



**కొయ్యూరు , అల్లూరి జిల్లా మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** మండలం లో అతి మారుమూల మఠం భీమవరం పంచాయితీ శివారు పుట్టకోట గ్రామంలో 17 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసినట్టు తహసీల్దార్ మురళీబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తొలి విడత పాస్ పుస్తకాలు పంపిణీలో ఈ గ్రామంలో హర్హులైన రైతులకు సకాలంలో పూర్తి చేయలేని కారణంగా ఇప్పుడు రెండవ విడత జరిపిన రీసర్వే పూర్తి చేసి నేటికీ పాస్ పుస్తకాలు అందని రైతులకు నేరుగా పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ మురళీబాబు తెలిపారు. మండలంలో రీసర్వే పూర్తికాని గ్రామాల్లో ప్రస్తుతం నిర్వహించే రెండవ విడత సర్వేలో పూర్తి చేసి కొత్త పాస్ పుస్తకాలు జారీ చేసే ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేసి అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ మురళీ బాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎంసి ఛైర్పర్సన్ మచ్చలి మంగ తల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు సంపరి శివప్రసాద్ మాజీ మండల అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, వీఆర్వో శ్యామ్, సర్వేయర్ నాగేశ్వరరావు రైతులు తదితరులు పాల్గొన్నారు .

## ఎం.బి.ఎ విద్యార్థులకు పలుచట్టాలపై అవగాహన కల్పించిన

ప్రముఖ న్యాయవాది పడాల వెంకట సుబ్బారావు.



**యానాం మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** యానాం నియోజకవర్గంకు చెందిన ప్రముఖ న్యాయవాది పడాల వెంకట సుబ్బారావును కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలో 2-3-26 నుండి 7-3-26 వరకూ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎం.డి పి) నిర్వహించనున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా పడాల వెంకట సుబ్బారావుని ఎం.బి.ఎ విద్యార్థులకు రిసోర్స్ పర్సన్‌గా ఆహ్వానించడం జరిగినది. 6-3-26 శుక్రవారంన జరగిన కార్యక్రమంలో ఎం.బి.ఎ విద్యార్థులకు భీమాచట్టాలు మరియు సైబర్ చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించిన పడాలరావు..ఈ సందర్భంగా పడాల రావును విద్యార్థులు సత్కరించడం జరిగినది.న్యాయవాది పడాల అంకితభావం- న్యాయ నైపుణ్యం- భవిష్యత్ మేనేజ్‌మెంట్ నిపుణులకు మార్గదర్శకత్వం అందించే సంకల్పానికి నిదర్శనమని ఇలాంటి మరెన్నో గౌరవాలు- విద్యాసేవలు పడాల రావుకు కలగాలని యానం నియోజవర్గంలో పలువురు న్యాయవాదులు, ప్రముఖులు, పలువురు రాజకీయ నాయకులు,స్నేహితులు తదితరులు పడాలను కొనియాడారు..

## అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసరించుకోవాలి..!!



**నందికొట్కూర్ మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** రైతులకు హాని కలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.రాజశేఖర్ డిమాండ్ చేశారు శుక్రవారం నందికొట్కూరు పోస్ట్ ఆఫీస్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మకి రైతు సంఘం నాయకులు బేస్తరాజు,హుస్సేన్మియా,బాలస్వామి,శేఖర్,షేక్షావలి,ఆర్.రాజు తదితరులు కలిసి పోస్ట్ ఆఫీస్ లోకొరియర్ పంపడం జరిగింది.ఈ సందర్భంగా ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం మూలంగా అమెరికా నుండి భారతదేశానికి దిగుమతే పారిశ్రామిక వ్యవసాయ వస్తువులపై సుంకాలు రద్దు చేయడం వల్ల ఏటా తొమ్మిది లక్షల కోట్ల విలువైన వస్తువులు ఆహార పదార్థాలు దిగుమతి అవుతాయి గోధుమలు,మొక్కజొన్న పత్తి సోయాబీన్ పండ్లు కూరగాయలు దిగుమతి చేసుకోవడం వల్ల మనదేశంలో 11 కోట్ల రైతు కుటుంబాలు తొమ్మిది కోట్ల పాడి రైతుల కుటుంబాలు దివాలా తీయడం జరుగుతుందన్నారు కావున రైతులకు హాని కలిగించే ఈ వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసరించుకోవాలని లేనియెడల ఆందోళన ఉదృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ ఈ బిల్లును వెంటనే వెనక్కి పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

## 185 పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయం

ఎరిక్షన్ బాబు ఆదేశాలమేరకు షేక్ ఇస్మాయిల్ దాతల సహకారం



**యర్రగొండపాలెం మార్చి 06 (అఖండ భూమి న్యూస్):** ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారం మరవలేనిదని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎర్రగొండపాలెం ప్రధానోపాధ్యాయులు ఎండీ ఖాసీం అన్నారు. ఎర్రగొండపాలెం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాలతో దాత డాక్టర్ షేక్ ఇస్మాయిల్ నేడు పాఠశాలలో చదువుతున్న 185 మంది పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమని అదేవిధంగా వారు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం కూడా అందిస్తానని చెప్పడం మన పాఠశాలకు కలిగిన అదృష్టమని,పరీక్షల వరకు నిరంతరము అల్పాహారం కొనసాగించడానికి ప్రతిరోజు ఒక దాత ముందుకు రావడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ సుబ్బారావు, కొల్లా ధనుమంతరావు, ఎం కిరణ్, పువ్వాడ శ్రీనివాసరావు మరియు ఉపాధ్యాయులు పి బాదరయ్య, కాలంగి శ్రీనివాసరావు, రజిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబుకి దాతలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాత డాక్టర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాలు, దాతల సహకారంతో మంచి మార్కులతో ముందుకు ఎదగాలని మన పాఠశాల జిల్లాలోనే ముందుండే విధంగా మంచి ఫలితాలు సాధించాలని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, పాఠశాలలో మొదటి మూడు ర్యాంకుల సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తానని వారు అన్నారు.

## మహిళ హక్కుల పరిరక్షణ మహిళ కాంగ్రెస్ ధ్యేయం

మహిళ కాంగ్రెస్ నేతల వెల్లడి....



**ఆలేరు మార్చి 6. (అఖండభూమి న్యూస్):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళల హక్కులను కాల రాయడం సమంజసం కాదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్యదర్శి మౌనికలు అన్నారు. శుక్రవారం నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో గల ఇందిరా భవనంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలందరినీ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మహిళలను కోటీశ్వరులు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. మహిళల అభివృద్ధికి, బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఆర్టీసీ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి, విజయవంతంగా అమలు చేస్తుందని కొనియాడారు. మహిళలకు మహిళా శక్తి పథకాల ద్వారా క్యాంటిన్లు, పెట్రోల్ బంకులను కేటాయించి, ఆర్థిక సహాయం అందించి అతివల స్వావలంబం గల ప్రజా ప్రభుత్వ కృషిని కొనియాడారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివాసం ఉంటారని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి 2026 ఉన్నతి ద్వారా తెలంగాణ ప్రగతి మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని తెలిపారు. ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు. ఆరోగ్య సేవలు అందిస్తున్న ఏఎన్ఎం లను, ఆశా వర్కర్లను, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను, మున్సిపల్ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పావని, మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి భాస్కర్, మున్సిపల్ కౌన్సిలర్లు వానరాశి మరియమ్మ మార్క్, మల్లెల సరిత శ్రీకాంత్, జిట్ట నీరజ, మాజీ కౌన్సిలర్ గుత్తా శమంత సీతారాం రెడ్డి, జిల్లా నాయకులు నీరజ, కవిత, పరంజ్యోతి, పుష్ప, సిద్ది లక్ష్మి, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గ్యాదపాక దీప, పట్టణ అధ్యక్షురాలు పాము అనిత, నాయకురాల్లు డి కవిత, శ్రీలత, సోనీ, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల



**యాదగిరిగుట్ట మార్చి 6.(అఖండభూమి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి (2వ వార్డులో) ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల బీర్ల అయిలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బీర్ల మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని ఆకాంక్షించారు, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగాలనేదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛమైన, అభివృద్ధి చెందిన యాదగిరిగుట్టను నిర్మించగలమని చెప్పారు. ప్రతి వార్డులో పరిశుభ్రత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజలు కూడా పరిశుభ్రతపై అవగాహన కలిగి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు....